# 63

# ఒలీవల కొండపై

## (26:30-46)

పస్కా భోజనము ఆరగించిన అనంతరము, యేసు మరియు పదనొకండు మంది అపొస్తలులు ఒలీవల కొండ దగ్గర నున్న గెత్సేమనే తోట లోనికి వెళ్లారు, అచ్చట యేసు ప్రార్థించాడు (26:30–46).

### అపొస్తలుడు యేసు నెరుగనని బొంకునను ప్రకటన (26:30–35)

**[30]అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్లిరి.**

**[31]అప్పుడు యేసు వారిని చూచి–ఈ రాత్రి మీరందరు నా విషయమై అభ్యంతరపడెదరు, ఏలయనగా–**

**గొఱ్ఱెల కాపరిని కొట్టుదును, మందలోని గొఱ్ఱెలు చెదిరిపోవును అని వ్రాయబడి యున్నది గదా. [32]నేను లేచిన తరువాత మీకంటె ముందుగా గలిలయకు వెళ్లెదననెను. [33]అందుకు పేతురు–నీ విషయమై అందరు అభ్యంతర పడినను నేను ఎప్పుడును అభ్యంతరపడనని ఆయనతో చెప్పగా [34]యేసు అతని చూచి–ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. [35]పేతురాయనను చూచి–నేను నీతోకూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పననెను; అదేప్రకారము శిష్యులందరు అనిరి.**

**వచనము 30.** వారందరు కలిసి మేడగదిలో ఆ నాడు గడిపిన సాయంకాలము ముగియుచుండిన ఏదో ఒక సమయంలో, యేసు యోహాను సువార్త 14 మొదలుకొని 16వ అధ్యాయం వరకు వ్రాయబడి యున్న సందేశాలు తన శిష్యులకు బోధించాడు మరియు 17వ అధ్యాయంలో వ్రాయబడి యున్నట్లు తన శిష్యుల కొరకు అత్యంత వ్యక్తిగతమైన ప్రార్థన చేసాడు (యోహాను 18:1 చూడు). పస్కా భోజన ఆరాధన ముగియుచుండినప్పుడు, యేసు మరియు ఆయన అపొస్తలులు **అందరు కలిసి ఒక కీర్తన పాడిరి**. హెల్లేల్ కీర్తనలను (స్తోత్ర గీతములు) పస్కా పండుగ సమయంలో ప్రజలందరు పాడుచుండిరి (21:9, 42; 26:20పై గల వ్యాఖ్యానము చూడు). యేసు మరియు ఆయన శిష్యులు సహితము ఈ సమయంలో అదే సాంప్రదాయమును పాటించారని మనము భావించవచ్చును.

ఆ తరువాత ఈ గుంపువారంత యెరూషలేము ద్వారములలో ఒక దాని గుండా వెలుపలకు వచ్చారు, కెద్రోను వాగు దాటారు, **ఒలీవల కొండ** మీదికెక్కారు (24:3పై గల వ్యాఖ్యానము చూడు). యేసు ప్రార్థన చేయుటకును, ఆయనను అప్పగించువాడు అచ్చోటికి వచ్చువరకు వేచియుండుటకును ఆ స్థలానికి వెళ్లాడు. ఈ సంభాషణ యేసు మరియు ఆయన పదనొకొండు మంది శిష్యులు ఒలీవల కొండకు వెళ్లుచుండగా కొనసాగినది.

**వచనము 31. ఈ రాత్రి మీరందరు నా విషయమై అభ్యంతరపడెదరు** అంటూ **యేసు** తన పదనొకొండు మంది శిష్యులకు తెలియజెప్పాడు. "అభ్యంతరపడుట" అని అర్థమిచ్చు గ్రీకు పదమునకు (*skandalizō*), "తొట్రిల్లుట," "తొట్రిల్లునట్లు చేయుట," లేక "(తొట్రిల్లునట్లు) ఒక ఉచ్చును ఏర్పాటు చేయుట" అనునవి అక్షరార్థములై యున్నవి. ఈ పదము క్రొత్త నిబంధనలో అత్యధికంగా రూపకాలంకారముగా ప్రయోగింపబడినది.[1] వారు యేసు యెడల కలిగియుండిన అనురక్తి నుండి తొట్రిల్లునట్లు చేయు పరిస్థితిని అపొస్తలులు త్వరలో ఎదుర్కొననై యుండిరి. "వారు అభ్యంతరపడుట కేవలము వారి వ్యక్తిగత భద్రత గూర్చిన భయమునుబట్టి కాదు, కానీ యేసు శ్రమనొందుటలో గల సదుద్దేశమును అవగాహన చేసుకొనలేని వారి అసమర్థతతనుబట్టియే" అని "నా విషయమై" అను పదజాలము సూచించుచున్నదని ఆర్. టి. ఫ్రాన్స్ అనుకొనుచున్నాడు.[2]

అటుతరువాత యేసు జెకర్యా 13:7లో గల ప్రవచన వాక్కులను ఉల్లేఖించి పలికాడు: **గొఱ్ఱెల కాపరిని** [నేను] **కొట్టుదును, మందలోని గొఱ్ఱెలు చెదిరిపోవును**. వీలైనంత విశాల దృక్పథములో, "గొఱ్ఱెలు" అను పదము ఆరంభములో ఇశ్రాయేలీయులను సూచించినది. యేసు, "గొఱ్ఱెల కాపరియై" యున్నవాడు (యోహాను 10:14; హెబ్రీయులకు 13:20; 1 పేతురు 2:25), ఆయన పట్టబడినప్పుడు వారు పలాయనము చిత్తగించుట గూర్చి వారికి ముందుగానే తెలియజెప్పుటకు ఈ మనఃకల్పనను ఇచ్చుట ఉపయోగించాడు. "నేను" అను మాట దేవుని సూచించుచున్నది, యేసు లోక పాపముల నిమిత్తము శ్రమనొంది మరణించవలెనని ముందుగా నిర్ణయించినది ఆయనే (యెషయా 53:4, 6, 10 చూడు).

**వచనము 32.** యేసు దుఃఖము మరియు నైరాశ్యముతో కూడిన తన సందేశమును తెలియజెప్పిన తదుపరి నిరీక్షణ మరియు ఆనందమును కలుగజేయు మాటలను కూడ వారితో పలికాడు. మరొక పర్యాయము, ఆయన **లేపబడుననియు** (16:21; 17:9, 23; 20:19), వారి కంటె **ముందుగా గలిలయకు వెళ్లుననియు** వారికి వాగ్దానము చేసాడు. తన పునఃరుత్థానము తరువాత, ఒక దూత ఈ ఆదేశమును ఆదివారము నాడు పెందలకడనే యేసు సమాధి యొద్దకు వచ్చిన స్త్రీల ద్వారా అపొస్తలులకు గుర్తుచేసాడు (28:7, 10, 16; మార్కు 16:7; యోహాను 21:1–23 చూడు).

"ముందుగా వెళ్లుట" అను మాటలు "అచ్చోటికి మొదటి చేరుకొనును" అను అర్థమునీయవచ్చును (14:22 చూడు), గనుక ఈ మాటలు 31వ వచనములోని గొఱ్ఱెల కాపరి/గొఱ్ఱెలు గూర్చిన మనఃకల్పనను సంపూర్తి గావించును. గొఱ్ఱెల కాపరి తన మందుకు నాయకుడుగా దానికి ముందుగా వెళ్లును. "మరియు అతడు తన సొంత గొఱ్ఱెలనన్నిటిని వెలుపలికి నడిపించునపుడెల్ల వాటికి ముందుగా నడుచును; గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించునని" యోహాను 10:4 సెలవిచ్చుచున్నది.

**వచనము 33.** అందుకు పేతురు, **నీ విషయమై అందరు అభ్యంతరపడినను, నేను ఎప్పుడును అభ్యంతరపడనని** ఆయనతో చెప్పెను. పేతురు చెప్పిన మాటలు నొక్కివక్కాణింపబడినవై యున్నవి: "నేను ఎప్పుడును అభ్యంతరపడను!" అది అతని స్వతఃస్సిద్ధమైన లక్షణమై యున్నట్లుగా, పేతురు భవిష్య వాణిని మాటలు మాటలాడుచు, ఇతర అపొస్తలులు ఏమనుకొనుచున్నారో మాత్రమే తెలియజేసాడు (14:28; 15:15; 16:16, 22; 17:4; 18:21; 19:27 చూడు).[3] అనుకొన్నట్లుగానే, యేసు యొక్క

దైవికమైన ముందెలివిని వ్యతిరేకిస్తూ ఆయన చెప్పిన మాటలను పేతురు పరస్పరము వ్యతిరేకించుట ఇది మొదటిసారి కాదు. అంతకుముందైతే, యేసు తన సొంత మరణము గూర్చి ప్రవచన రీతిగా వారితో చెప్పినప్పుడు పేతురు, "ప్రభువా, అది నీకు దూరమగుగాక! అది నీ కెన్నడును కలుగదని" పలికాడు (16:22).

**వచనము 34**. అపొస్తులులందరు అభ్యంతరపడుదురని **యేసు** ముందుగా తెలియజెప్పాడు (26:31), కానీ ప్రస్తుతమైతే ఆయన పేతురుపై తన దృష్టిని కేంద్రీకరించుచు: **ఈ రాత్రి, కోడి కూయక మునుపే, నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నానని** అతనితో చెప్పాడు. పేతురు యేసుకు వ్యతిరేకముగా పలికిన మాటలు చిత్తశుద్ధితో కూడినవై యుండెనని యేసు ఎరిగియుండెను; లేదంటే. ఆయన పేతురు పట్ల యింకా ఎక్కువ కఠినుడుగా ప్రతిస్పందించెడివాడే.

పేతురు యేసును ఎరుగనని బొంకును–ఒక్కసారి కాదు, కానీ ముమ్మారు. పేతురు ఆయనను ఎరుగనని కోడి రెండు మారులు కూయక మునుపే బొంకునని యేసు నిర్దిష్టముగా సెలవిచ్చాడు (మార్కు 14:30). యెరూషలేములో నివసించుచుండిన యూదులు కోళ్ల పెంపకము చేపట్టలేదని యూదా మత బోధకుల సాంప్రదాయము చెప్పుచున్నది.[4] మొదటి శతాబ్దము నాటి వాడుకను ఈ సాంప్రదాయము నిక్కచ్చిగా తెలియజెప్పుచున్నదో లేదో అను దానితో నిమిత్తము లేకుండానే, రోమీయులు కోళ్ల పెంపకము కొనసాగించుటను యూదీయ నియమనిబంధనలు నిరోధించి యుండవు. రోమీయుల ప్రకారము మూడవ జాము (మధ్యరాత్రి 12 గంటలు మొదలుకొని ఉదయం 3 గంటల వరకు)[5] "కోడి కూత" అని పిలువబడునంత క్రమంగా కోడి పుంజులు కూయుచుండినవి (మార్కు 13:35).

యేసు పేతురు బొంకుట గూర్చి మాత్రమే కాదు, కానీ అతడు తిరిగి విశ్వసనీయులైన తన సహోదరుల యొద్దకు తిరిగి వెళ్లునని కూడా ముందుగానే వారికి తెలియజెప్పాడు. పేతురు యొక్క నమ్మిక తప్పిపోకుండునట్లు ఆయన అతని కొరకు ప్రార్థించాడని లూకా 22:31, 32 సూచించుచున్నవి. అటుతరువాత, "నీ మనసు తిరిగిన తరువాత నీ సహోదరులను స్థిరపరచుమని" అంటూ ఆయన పేతురును మందలించాడు.

**వచనము 35.** దీని పర్యవసానము ఘోరాతిఘోరమైనదై యుండునని తన కళ్లముందున్నట్లుగానే ఊహించుకొనుచు, **పేతురాయనను చూచి, నేను నీతో కూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పననెను.** "ప్రభువా, నీతో కూడ చెరలోనికిని మరణమునకును వెళ్లుటకు సిద్ధముగా ఉన్నానని!" కూడ పేతురు యేసుతో చెప్పాడు (లూకా 22:33). అతడు తన యొద్ద ఉండిన కత్తిని ఒరలో నుండి తీసి యేసు శత్రువుల మీదికి దూయుట ద్వారా పేతురు యేసు ప్రభువు యెడల కలిగియుండిన కట్టుబాటు ఎంత తీవ్రమైనదై యుండినదో స్పష్టముగా కనబడుచున్నది (యోహాను 18:10); అనగా పేతురు ప్రభువు పక్షాన పోరాడుటకు సహితము సిద్ధముగా నుండెనని తెలియుచున్నది. ఏది ఏమైనా, అటుతరువాత పేతురు మిగిలిన శిష్యులతోకూడ పారిపోయాడు (మార్కు 14:50), ఎట్టకేలకు యేసును ఎరుగనని ముమ్మారు బొంకాడు (మత్తయి 26:69–75).

అదే ప్రకారము **శిష్యులందరు** కూడ యేసు యెడల యెడతెగని నిబద్ధత కలిగియుండిరని పలికారు, కానీ పేతురు మాత్రం అందరి కంటె ఎక్కువ మొండి పట్టుదలతో ఉండినట్లు అగుపించుచున్నది (మార్కు 14:31).

## తీవ్రమైన మనస్తాపము కలిగిన సమయము (26:36-38)

**[36]అంతట యేసు వారితోకూడ గెత్సేమనే అనబడిన చోటికి వచ్చి–నేను అక్కడికి వెళ్లి ప్రార్థనచేసి వచ్చు వరకు మీరిక్కడ కూర్చుండుడని శిష్యులతో చెప్పి [37]పేతురును జెబెదయి యిద్దరు కుమారులను వెంటబెట్టుకొని పోయి, దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలు పెట్టెను. [38]అప్పుడు యేసు–మరణమగు నంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది; మీరు ఇక్కడ నిలిచి, నాతోకూడ మెలకువగా నుండుడని వారితో చెప్పెను.**

**వచనము 36.** ఒలీవల కొండ మీదికి వెళ్లిన తరువాత, **యేసు** మరియు ఆయన పదనొకొండు మంది శిష్యులు **గెత్సేమనే అనబడిన చోటికి చేరుకొన్నారు**. "గెత్సేమనే" అను పేరు క్రొత్త నిబంధనలో రెండు పర్యాయములు మాత్రమే అగుపించుచున్నది (26:36; మార్కు 14:32). అది రెండు పదములు కలుపబడినప్పుడు, "నూనె గానుగ" అని అర్థమిచ్చు రెండు హెబ్రీ/అరమెయిక్ మాటల లిప్యంతరీకరణమై యున్నది. బహుశా, గెత్సేమనే తోటలో ఒలీవ నూనె తీయుటకు ఒక గానుగ ఉండియుండును. అదొక "తోట" (*kēpos*) అని, యోహాను 18:1, 26 గుర్తించుచున్నవి, ఈ పదము ఎత్తైన స్థలములో అత్యధికంగా సాగుచేయబడుచుండు ఏ చోటునైనా సూచింపవచ్చును. ఈ సందర్భములో *kēpos* బహుశా "ఒలీవల చెట్లుండిన ఒక వృక్షసముదాయమును" (తోపు) సూచింపవచ్చును (NLT). గెత్సేమనే తోట సొంతదారు పండుగల సందర్భములో యేసు మరియు ఆయనతో కూడ వచ్చినవారు అచ్చట బసచేయుటకు అనుమతించిన ఒక శిష్యుడై యుండవచ్చును. యేసు తన శిష్యులతో కూడ ఈ స్థలమునకు తరుచుగా వచ్చుచుండెడివాడని అనేక లేఖన భాగములు సూచించుచున్నవి. గనుక ఇస్కరియోతు యూదాకు ఈ స్థలము ఎలా తెలియునో దీనినిబట్టి మనము తెలిసికొనవచ్చును (యోహాను 18:2; లూకా 22:39 చూడు).

గెత్సేమనే తోట ఉండినదని అనేకులు నమ్ముచున్న స్థలములో, "సమస్త జనుల ప్రార్థన మందిరము" అని పిలువబడుచున్న ఒక దేవాలయము కలదు. దానికి సమీపంలో ఒక చిన్న తోట కలదు, దాని చుట్టూర రాతి ప్రహరీ గోడ కలదు. ఈ ప్రాంతములో కొన్ని ప్రాచీన ఒలీవ చెట్లు కలవు. ఈ చెట్లు క్రీస్తు కాలము నాటివని కొందరు సాధికారంగా చాటిచెప్పుదురు. ఏది ఏమైనా, రోమీయులు పట్టణమును ముట్టడించి దానిని నాశనము చేసినప్పుడు వారు ఆ కాలము నాటి చెట్లను నరికివేసారు (క్రీ.శ. 70).[6] (దీని గూర్చి కొంచెము అతిశయోక్తిగా చెప్పుకొనినను) అట్లయినను. ఈ చెట్ల వేళ్లు నిలిచియుండి ప్రస్తుతము అచ్చట దర్శనమిచ్చు చెట్లుగా ఎదిగియుండుట సాధ్యమే.

ఒక గుహ గల సమీప ప్రాంతము, గెత్సేమనే తోట అచ్చట ఉండియుండవచ్చునని గుర్తించుచున్నది. గెత్సేమనే తోట ఉండినదని చెప్పుకొనుటకు మొదట పేర్కొనబడిన స్థలము కంటే ఈ స్థలమే ఎక్కువ సాధ్యమని మిఖాయేల్ జే. విల్కిన్స్ అభిప్రాయపడుచున్నాడు:

> రెండవదిగా పేర్కొనబడిన స్థలము బహుశా ఎక్కువ ఆశను పుట్టించుచున్నది, ఇది సాంప్రదాయముగా చెప్పుకొనబడు తోటకు ఉత్తరమున వంద అడుగుల మేరలో, ఒలీవల కొండకు కొంచెము క్రిందగా కలదు. గుహ చాలా పెద్దది, సుమారు 36 x 60 అడుగుల (11 x 18 మీటర్లు) పరిమాణము గలదై యున్నది, నూనె గానుగల నుంచుటకు గోడల్లో అంతర్‌గుహలు తొలుచబడి యున్నవి.[7]

నూనె గానుగలు ఆకులు రాలే కాలము మరియు చలికాలములో ఒలీవల పంట కోయబడినప్పుడు మాత్రమే ఉపయోగింపబడినవి, గనుక పస్కా పండుగ జరుపుకొనబడు వసంత కాలములో గుహ ఖాళీగానే యుండును. యేసు ఆయన శిష్యులతో కూడ గెత్సేమనే తోటలో సమయము గడుపుటకు అదొక హాయిని గొలుపు ఆకర్షణీయమైన, నిద్రించుటకు అనుకూలముగా నుండు వెచ్చని వాతావరణముండిన స్థలమై యుండవచ్చును. అందుచేతనే యేసు వారి దగ్గర నుండి కొంచెము దూరము వెళ్లి ప్రార్థించుచుండగా, బహుశా శిష్యులు చల్లగాను హాయిగాను ఉండిన ఈ నిర్దిష్ట రాత్రి సమయంలో చక్కగా నిద్రించారు (యోహాను 18:18).[8] యేసును పట్టుకొనవలెనని జనులు ఆయన మీదికి దొమ్మిగా వచ్చిన సమయంలో ఒక పడుచువాడు తన దిగంబర శరీరము మీద ఎందుకు "నారబట్ట" (*sindōn*) లేక బిగుతైన లోపలి ఉడుపు మాత్రమే ధరించాడో ఈ పరిస్థితి మనకు తేటతెల్లముగా తెలియజెప్పుచున్నది (మార్కు 14:51). ఈ పడుచువాడు మార్కునే అయియుండెనని కొందరు నమ్ముచున్నారు, ఏలయనగా ఈ సంఘటనను తన సువార్తలో గ్రంథస్థం చేయుచు పేర్కొనుచున్నది మార్కు మాత్రమే. మార్కు, లేదా ఈ పడుచువాడు ఎవరై యుండినప్పటికిని, వాడు యేసు మరియు మిగతా పదనొకొండు మంది శిష్యులతో కూడ నిలిచియుండినట్లయితే, ఇతరులు కూడ వారితో ఉండియుండవచ్చును.

గెత్సేమనే తోటలో ప్రవేశించి కొంత దూరము లోపలికి వెళ్లిన తరువాత, (యేసు) **నేను అక్కడికి వెళ్లి ప్రార్థన చేసి వచ్చువరకు మీరిక్కడ కూర్చుండుడని, తన శిష్యులతో చెప్పెను.** "మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు ప్రార్థనచేయుడని" కూడ ఆయన వారికి ఆదేశమిచ్చాడు (లూకా 22:40).

**వచనము 37.** ఆ తరువాత, **ఆయన పేతురును జెబెదయి యిద్దరు కుమారులను** (అనగా, యాకోబు మరియు యోహాను) **వెంటబెట్టుకొని** యింకా కొంచెము దూరము – "రాతి వేత దూరము" (లూకా 22:41) – వెళ్లాడు. ఈ ముగ్గురు అపొస్తలులు యేసుకు సన్నిహితముగా నుండిన శిష్యత్రయమై యుండిరి (17:1పై గల వ్యాఖ్యానము చూడు). వారు ఆయనకు ఆలంబనమిచ్చువారుగాను, సౌకర్యమును కలుగజేయువారుగాను ఉండవలెనను ఉద్దేశముతో ఆయన వారిని తనతో కూడ తీసికొనివెళ్లాడు.

ఈ సమయంలో, యేసు **దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలుపెట్టెను.** ఆయన సిలువ శ్రమల ననుభవింపనై యుండిన సందర్భములో ఈ పదజాలము యేసు మానవత్వమును తెలుపుచున్నది. ఏది ఏమైనా, సిలువవేయబడుట వలన ఆయన శారీరక మరియు భావోద్రేకమైన బాధను మాత్రమే అనుభవించుట కాదు, కానీ ఆయన లోక పాపమును సహితము భరించుచు (2 కొరింథీయులకు 5:21) తన తండ్రి నుండి వేరుచేయబడనై యుండెను (27:46). ఇది "ఇంకను దేవుని యందు నిరీక్షణ యుంచుచునే, క్రూరమైన మరణము ఆయన కొరకు పొంచియుండినదని ఎరిగినవాని దుఃఖపూరితమైన విధేయతమై యున్నదని" అంటూ డేవిడ్ హిల్ యేసు పరిస్థితిని వర్ణించుచున్నాడు.[9]

**వచనము 38. మరణమగునంతగా, నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నదని** యేసు ఆయనతో కూడ ఉండిన తన సహచరులతో చెప్పాడు. "నా హృదయము, నేను మరణమగునంతటి దుఃఖముతో నిండియున్నదని" JNT బైబిల్ అనువాదము చెప్పుచున్నది. యేసు సెలవిచ్చిన ఈ ప్రకటనలోని మొదటి భాగము మన దృష్టిని కీర్తనల గ్రంథంలోని

మాటల దిశగా మళ్లించుచున్నది, "నా ప్రాణమా, నీవు ఏల క్రుంగియున్నావు?" అని రచయిత ప్రశ్నించుచున్నాడు (కీర్తనలు 42:5, 11; 43:5). అతడు దేవుని యందు, అతనిని విడిపించువాని యందు నిరీక్షణ యుంచవలసినదని కీర్తనకారుడు తనకుతాను మళ్లీ మళ్లీ గుర్తుచేసికొనుచున్నాడు.

**మీరు ఇక్కడ నిలిచి, నాతో కూడ మెలకువగా నుండుడని** యేసు తన ముగ్గురు శిష్యులతో చెప్పాడు. ఈ సంక్లిష్ట సమయంలో ఆయనకు తన స్నేహితుల మద్దత్తు అవసరమయ్యింది, కానీ వారు ఆయనను బొత్తిగా నిరాశపర్చారు (26:40, 43, 45).

## ప్రార్థన సమయము (26:39-46)

**39కొంత దూరము వెళ్లి, సాగిలపడి-నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని ప్రార్థించెను. 40ఆయన మరల శిష్యులయొద్దకు వచ్చి, వారు నిద్రించుట చూచి-ఒక గడియయైనను నాతోకూడ మేల్కొనియుండలేరా? 41మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థనచేయుడి; ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనమని పేతురుతో చెప్పి 42మరల రెండవమారు వెళ్లి-నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నాయొద్దనుండి తొలగిపోవుట సాధ్యముకానియెడల, నీ చిత్తమే సిద్ధించుగాక అని ప్రార్థించి 43తిరిగి వచ్చి, వారు మరల నిద్రించుట చూచెను; ఏలయనగా వారి కన్నులు భారముగా ఉండెను. 44ఆయన వారిని మరల విడిచి వెళ్లి, ఆ మాటలే చెప్పుచు మూడవ మారు ప్రార్థనచేసెను. 45అప్పుడాయన తన శిష్యులయొద్దకు వచ్చి-ఇక నిద్రపోయి అలసట తీర్చుకొనుడి; ఇదిగో ఆ గడియవచ్చి యున్నది; మనుష్యకుమారుడు పాపులచేతికి అప్పగింపబడుచున్నాడు; 46లెండి వెళ్లుదము; ఇదిగో నన్ను అప్పగించువాడు సమీపించి యున్నాడని వారితో చెప్పెను.**

**వచనము 39.** వారు ఆయన గూర్చి కనిపెట్టుకొని యుండవలెనని చెప్పిన తరువాత యేసు పేతురు, యాకోబు, మరియు యోహానుల యొద్ద నుండి **కొంత దూరము వెళ్లి, సాగిలపడెను.** యేసు పరిచర్య చేయుచుండిన రోజుల్లో, అసంఖ్యాకమైన ప్రజలు ఆయన యెదుట సాగిలపడ్డారు (2:10, 11; 8:2; 9:18; 17:6; మార్కు 3:11; 5:6; 10:17; లూకా 5:12; 17:16). ఈ సమయంలో, ఆయన దేవుని యెదుట వినయపూర్వకముగా సాష్టాంగపడి మనఃపూర్వకమైన ప్రార్థన చేసాడు.

**నా తండ్రీ, సాధ్యమైతే, ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్టప్రకారము కాదు, నీ చిత్తప్రకారమే కానిమ్మని** యేసు ప్రార్థించాడు. యేసు చెప్పుచుండిన "గిన్నె" శ్రమ మరియు మరణపు గిన్నెయై యుండెను. యాకోబు మరియు యోహాను, తమ తల్లిని వారికి ప్రతినిధిగా యేసు నొద్దకు పంపి, ఆయన రాజ్యములో వారిలో ఒకడు కుడివైపునను మరొకడు ఎడమ వైపునను కూర్చుండవచ్చునా యని ఆయనను అడిగినప్పుడు ఆయన ఇదే భాషను ఉపయోగించాడు. "నేను త్రాగబోవు గిన్నె లోనిది మీరు త్రాగగలరా?" అని ఆయన వారినడిగాడు (20:22). పాత నిబంధన పదముల ప్రకారము, "గిన్నె లోనిది త్రాగుట" అనగా అది ఎటువంటి సంఘటనయైనను, మంచిదైనా లేక చెడుదైనా, అనుభవించుట యను అర్థమిచ్చినది (కీర్తనలు 11:6; 16:5; 23:5; 75:8; 116:13;

యెషయా 51:17; యిర్మీయా 16:7; 25:15). ఆయన కొరకు గొల్గొతాపై వేచియుండిన మహాభయభీతి చేత యేసు యొక్క మానవ స్వభావము తిప్పికొట్టబడింది, కానీ ఆయన బాధాకరమైన ఈ మరణము నుండి తొలగింపబడవలెనను ఆయన కోరిక ఆయన తన తండ్రి చిత్తమునే నెరవేర్చవలెనను కోరిక చేత వమ్ముచేయబడినది (6:10 చూడు).

**వచనము 40.** ఈ ముగ్గురు అపొస్తలులు **నిద్రించుచుండిరి,** అయినప్పటికిని యేసు తన గమనికను మొదట **పేతురుపై** ప్రయోగించాడు. పేతురు ప్రభావము ఇతర శిష్యులపై అధికముగా నుండుట లేదా అవసరమైతే అతడు యేసుతో కూడ మరణించునని అతడు మొండిధైర్యముతో పట్టుబట్టుట ఇందుకు కారణమై యుండవచ్చును (26:33, 35). **ఒక గడియయైనను నాతో కూడ మేల్కొని యుండలేరా?** అని ఆయన అతనినడిగాడు. ఆయనతో కూడ ఎంతో సన్నిహితముగా నుండిన స్నేహితులు ఆయన ప్రార్థన చేయుచుండగా అవసరమై యుండిన ఈ సమయంలో ఆయన కొరకు ఒక గంట సేపు మెలకువగా ఉండలేకపోయిన పరిస్థితి యేసు హృదయమును ఎంతో గాయపర్చినట్లయ్యింది.

క్రొత్త నిబంధనలో, నిద్రించుట కొన్ని పర్యాయములు అజాగ్రత్తగా జీవించుచు, వారుడించిన పరిస్థితుల పట్ల సరైన శ్రద్ధ వహించనివారికి ఒక అలంకారముగా ప్రయోగింపబడినది. నిద్రించుటకు బదులుగా, వారు మేల్కొని అప్రమత్తులై యుండవలెనని క్రైస్తవులు మందలించబడుచున్నారు (రోమీయులకు 13:11; 1 కొరింథీయులకు 11:30; ఎఫెసీయులకు 5:14; 1 థెస్సలొనీకయులకు 5:4-8).

**వచనము 41**. మరొక పర్యాయము, వారు **మెలకువగా ఉండవలెనని** యేసు తన అపొస్తలులను విజ్ఞప్తిచేసాడు (26:38 చూడు). వారు **శోధనలో ప్రవేశించకుండునట్లు ప్రార్థన చేయవలెనని** కూడ ఆయన వారితో చెప్పాడు (6:13 చూడు). ఇంతకూ, వారేమి చేయవలెనని శోధింపబడియుందురు? వారు సరిగ్గా ఇదివరకు చేసిన పనే - ఆయనను విడిచిపెట్టి పారిపోవుట (మార్కు 14:50) - మరలా చేయుదురని ఆయన భావించియుండును.

**ఆత్మ సిద్ధమే, గాని శరీరము బలహీనమని** యేసు సమ్మతించాడు. ఇచ్చట పేర్కొనబడుచున్న "ఆత్మ" (*pneuma*) మనలో సజీవముగా నున్న అస్తిత్వమును, మనలను చైతన్యవంతులను గావించి మనకు జీవమునిచ్చు ఆత్మను సూచించుచున్నది. మన పరిజ్ఞానము, చిత్తము, మరియు భావోద్రేకమునకు మూలాధారము ఈ ఆత్మయే.

ఈ సందర్భములో, బలహీనమైనది గనుక అలసిపోవు (26:43 చూడు) "శరీరము" (*sarx*) మన భౌతిక "దేహమును" సూచించును (NIV; NLT). కొన్ని బైబిల్ అనువాదములు ఈ పదమును ఎక్కువ నిర్గుణ భావముతో "మానవ స్వభావము" అని అనువదించును (NJB; JNT), ఇది చెడు చేయుటకు అంతరంగమందు గల ఆశను సూచించవచ్చును. ఈ రెండవ అనువాదము అసలు అర్థమును అతి తక్కువగా తెలియజేయుచున్నది.

**వచనము 42**. మరల రెండవమారు వెళ్లి, యేసు **నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నా యొద్ద నుండి తొలగిపోవుట సాధ్యము కానియెడల, నీ చిత్తమే సిద్ధించునుగాక** అని ప్రార్థించాడు. ఈ సారి, "ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోనిమ్ము" అను పదజాలము (26:39) "నీ చిత్తమే సిద్ధించునుగాక" అను మాటలుగా మారిపోయినది.

**వచనము 43.** యేసు ప్రార్థించిన తదుపరి తన శిష్యుల యొద్దకు వచ్చినప్పుడు, **వారు**

**మరల నిద్రించుట చూచెను, ఏలయనగా వారి కన్నులు భారముగా ఉండెను.** "ఆయనకేమి ఉత్తరమియ్యవలెనో వారికి తోచలేదు" అని మార్కు 14:40 చెప్పుచున్నది, గనుక యేసు వారితో మాటలాడాడని స్పష్టమగుచున్నది. వారు కేవలము నిస్సత్తువగలవారగుట మాత్రమే కాదు; వారు "దుఃఖముచేత నిద్రించిరి" (లూకా 22:45). ఆ దినమంతా వారు ఎన్నో విషయాలు ఎదుర్కొన్నారు, గనుక వారి భావోద్రేకములు వాటి చిట్టచివరి పరిమితి వరకు సాగదీయబడినవి. కొన్ని పర్యాయములు మనలను దుఃఖమునకు దూరము చేయుటకు అది నిద్రమత్తును కలిగించవచ్చును; కానీ శిష్యులకు కలుగజేయబడినదని లూకా సువార్తీకుని ప్రకటన ధ్వనించుచున్నట్లుగా అది క్రుంగుదలను కూడ కలుగజేయవచ్చును.

**వచనము 44.** యేసు **వారిని మరల విడిచి వెళ్లి, ఆ మాటలే చెప్పుచు మూడవ మారు ప్రార్థన చేసెను.** శ్రమ యను గిన్నెను మరియు మరణమును తండ్రి తొలగించవలెనని ఆయన – ముమ్మారు – మనఃపూర్వకముగా ప్రార్థించాడు. యేసు చేసిన ప్రార్థనల తీవ్రత ఎంతో గంభీరమైనదై యుండినదని లూకా సువార్తీకుని చేత గుర్తింపబడినది: "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా, ఆయన చెమట నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 22:44).[10] యేసు ప్రార్థన చేయుచుండగా పరలోకము నుండి యొక దూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెనని కూడ లూకా సువార్త రచయిత గమనించాడు (లూకా 22:43).[11]

యేసు మతపిచ్చిగల ఒక మరణదండన పడినవాడుగా మరణమును ఆహ్వానించలేదు. కానీ దేవుని ఉగ్రతను సంతృప్తిపర్చుటకును తద్వారా లోకమును పాపము నుండి రక్షించుటకును అదొక్కటే మార్గమై యుండినది గనుక ఆయన దానికి తనను తాను వశపర్చుకొన్నాడు (యోహాను 3:16, 36; 1 యోహాను 2:1, 2). కాబట్టి శ్రమ యను గిన్నె మరియు సిలువ మరణము తొలగింపబడలేకపోయినవి.

ఆయన చేసిన ప్రార్థనల ద్వారా, యేసు తన చిత్తము కంటె తన తండ్రి చిత్తమునకే ఉన్నతమైనది మరియు ప్రాధాన్యమైన స్థానము నియ్యవలెనని దృఢముగా నిశ్చయించుకొన్నాడు. ఆయన గెత్సేమనే తోటలో దేవునికి వినయపూర్వకముగా విధేయుడగుట, ఆదాము హవ్వలు ఏదెను తోటలో దేవుని పట్ల ప్రదర్శించిన మూర్ఖపు ధిక్కారమునకు అత్యంత తారతమ్యమైన విషయముగా నున్నది. "క్రైస్తవులకు, గెత్సేమనే తోట, ఏదెను తోటకు వ్యతిరిక్తమైనదిగా నున్నదని" డగ్లస్ ఆర్. ఏ. హేర్ చెప్పుచున్నాడు.[12]

**వచనము 45.** ఆయన ప్రార్థన చేయుట ముగించిన మీదట, **గడియ వచ్చియున్నదని యేసు తన శిష్యులకు** తెలియజెప్పాడు (26:18పై గల వ్యాఖ్యానము చూడు). **మనుష్యకుమారుడు పాపుల చేతికి అప్పగింపబడుచున్నాడు.** యేసు సంకల్పము ఇహలోకములో నెరవేరు సమయము రానేవచ్చింది. ఆయనతో కూడ మెలకువగా నుండి ప్రార్థన చేయవలెనని చెప్పినవారిని ఆయన మేల్కొలుపుచుండగా, ఆయనను పట్టుకొనుటకు బహు గొప్ప జనసమూహము ఆయనను సమీపించుచుండెను.

**వచనము 46.** యేసు, **లెండి** అని బిగ్గరగా పలుకుచు నిద్రించుచుండిన అపొస్తులులను మేల్కొల్పాడు. తండ్రి చిత్తమునకు విధేయతతో లోబడుచు ఆయన కొరకు ఎదురుచూచుచుండిన మరణమునకు అప్పగించుకొనవలసిన సమయము వచ్చేసింది. ఆయనను అప్పగించనైయుండినవాడు సమీపముననే యుండెను. ఇప్పుడు తెర దించబడనై

యుండిన నాటకములో వారు చురుకుగా పాల్గొనుచున్న పాత్రులై యుండునట్లు శిష్యులు సంపూర్తిగా మెలకువతో ఉండవలసినవారై యుండిరి.

---

సూచనలు

[1]ఈ పదము మత్తయి వ్రాసిన సువార్తలో అనేక పర్యాయములు అగుపించుచున్నది (5:29, 30; 11:6; 13:21, 57; 15:12; 17:27; 18:6, 8, 9; 24:10; 26:31, 33). [2]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 370. [3]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 777. [4]Mishnah *Baba Kamma* 7.7; Talmud *Baba Kamma* 82b. [5]14:25పై గల వ్యాఖ్యానము చూడు. [6]Josephus *Wars* 5.12.4. [7]Michael J. Wilkins, "Matthew," in *Zondervan lllustrated Bible Backgrounds Commentary,* vol. 1, *Matthew*, *Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 166. [8]గెత్సేమనే తోటకును ఈ గుహకునుగల సంబంధము గూర్చిన అదనపు సమాచారము కొరకు John E. Taylor, "The Garden of Gethsemane: Not the Place of Jesus' Arrest," *Biblical Archaeology Review* 21 (July/August 1995), 26-35, 62 చూడు. [9]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 341. [10]"Hemohidrosis" or "hematidrosis" అను ఒక వైద్య పరిస్థితి ఫలితంగా, యేసు శరీరములో నుండి కారుచుండిన చెమట రక్తముతో మిళితమై యుండినదని కొందరు నమ్ముదురు. ఒకరు, చర్మము ఉపరితలములో నున్న చిన్న రక్తనాళములు పిగిలిపోవునంతటి ఒత్తిడి క్రింద ఉన్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది; అటుతరువాత రక్తము చెమటతో మిళితమై చర్మములో గల సూక్ష్మరంధ్రములలో నుండి బయటికి కారుతుంది. లూకా మనకు తెలియజేయుచున్న వర్ణన ఒక సామాన్య పోలికయై (సామ్యము) యున్నదని ఇతరులు వాదించుదురు: యేసు శరీరములో నుండి కారుచుండిన చెమట రక్తపు బిందువుల వలె (*hōsei*) బహుశా నేలను పడునంతటి పరిమాణములో – ఉండెను. అనగా, ఆయన విస్తారముగా చెమట కార్చుచుండెనని అర్థము.

[11]లూకా 22:43, 44 మూల గ్రంథ పాఠము గూర్చిన ఒక సమస్యను లేవదీయుచున్నది. యునైటెడ్ బైబిల్ సొసైటివారు ముద్రించిన గ్రీకు గ్రంథ పాఠము ఈ వచనములకు రెట్టింపు కుండలీకరణము చేసి (బ్రాకెట్లు పెట్టి), లూకా రచించిన మూల గ్రంథములో ఇవి లేనట్లుగానే పరిగణించుదురు. [12]Douglas R. A. Hare, *Matthew*, Intepretation (Louisville: John Knox Press, 1993), 303. రోమీయులకు 5:19 చూడు.